విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999




# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 89 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi ఆదివారం 12 ఏప్రిల్ 2026 • పేజీలు : 8 • వెల 2/-


## జ్యోతిరావు పూలే జయంతి

### ఘనంగా నివాళి అర్పించిన చంద్రబాబు, మంత్రులు



**అమరావతి,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** :మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఘన నివాళు లర్పించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు అని సీఎం చంద్రబాబు అన్నారు. సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని మంత్రి లోకేశ్ కొనియాడారు. ఆ మహాత్ముని జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం, మంత్రి పోస్టు చేశారు.'మహాత్మా జ్యోతిరావు పూలే

మిగతా 2వ పేజీలో..

## న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగింది

### హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి



**విశాఖపట్నం,ఏప్రిల్11( చట్టం న్యూస్)** : చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే ఒక గౌరవమని ఉద్ఘాటించారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలో ఆంధప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక

మిగతా 2వ పేజీలో..

## బెంగాల్లో తృణమూల్‌కు ఓటమి భయం

### అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు — బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోదీ

**కోల్‌కతా,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్వ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



## హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

### కాల్‌ఉప విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం



**న్యూఢిల్లీ,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్

మిగతా 2వ పేజీలో..

## ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

### తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసే యత్నం

### ఎన్నికల ప్రచారసభలో మమతా బెనర్జీ విమర్శలు


**కోల్‌కతా,ఏప్రిల్11( చట్టం న్యూస్)** : ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించినట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. పశ్చిమ మేదినిపూర్ జిల్లాలోని కేషియారిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, తనపై తప్పుడు కేసులు బనాయించడం ద్వారా భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని అన్నారు. అయితే ఆ పార్టీ గేమ్ ప్లాన్‌ను టీఎంసీ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని తెలిపారు. భవనాపూర్‌లో

మిగతా 2వ పేజీలో..



## ఈ సారి వర్షాలు తక్కువే

### జాగ్రత్తగా ఉండాలన్న వాతావరణ కేంద్రం



**హైదరాబాద్,ఏప్రిల్11( చట్టం న్యూస్)** : ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. అయితే అంతగా వర్షాలు మాత్రం పడవని వాతావరణ సంస్థ ప్రకటించింది. తాజాగా తెలంగాణలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బలమైన ఎల్-నినో ప్రభావం, పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితుల కారణంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలంగాణ వెదర్ మ్యాన్ ట్వీట్ చేసింది. 2026 వర్షపాతానికి సంబంధించిన అంచనాలు తెలంగాణలో కొంత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా తెలంగాణలో మంచి వర్షాలు పడ్డాయని.. ముఖ్యంగా 2025లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. రైతులు సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు

మిగతా 2వ పేజీలో..

## వేసవి సెలవుల్లో విద్యార్థులకు డ్రై రేషన్

### సీమ జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు ప్రాధాన్యం

**అమరావతి,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : ఆంధ్రప్రదేశ్‌లో వేసవి సెలవుల కారణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోకుండా, కూటమి ప్రభుత్వం 'డ్రై రేషన్' పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులు వేసవి సెలవుల్లో పౌష్టికాహారానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏపీ కూటమి ప్రభుత్వం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. సాధారణంగా పాఠశాలలు ఉన్నప్పుడు మధ్యాహ్న భోజనం అందుతుంది, కానీ సెలవుల్లోనూ వారి ఇంటికే రేషన్ పంపే డ్రై రేషన్ కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న

మిగతా 2వ పేజీలో..

## క్లీన్ పాలిటిక్స్.. పాజిటివ్ ఓటింగ్



- ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి
- ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి
- కార్యకర్తల కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్'
- శిక్షణా తరగతుల్లో టిడిపి అధినేత చంద్రబాబు

**అమరావతి,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : పాజిటివ్ ఓటు పెరగాలని, క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేశారు. జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు

మిగతా 2వ పేజీలో..

## చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

### మరోమారు హెచ్చరించిన ట్రంప్



**న్యూయార్క్,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్,

మిగతా 2వ పేజీలో..

## మహాత్మా జ్యోతిబా పులే 200వ జయంతి

### పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోదీ సంభాషణ

**న్యూఢిల్లీ,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : మహాత్మా జ్యోతిబా పులే 200వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలో శనివారంనాడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రేరణా స్థల్ వద్ద నివాళులు అర్పించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు సంభాషించు కున్నారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని అక్కడే ఉన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో

మిగతా 2వ పేజీలో..



## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

### అధికారికంగా ప్రకటించిన బోర్డు




**హైదరాబాద్,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి

మిగతా 2వ పేజీలో..

## 200కు పైగా సీట్లలో గెలిస్తున్నాం

### ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వ ఏర్పాటు

### ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా

**చెన్నై,ఏప్రిల్11 ( చట్టం న్యూస్)** : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ

మిగతా 2వ పేజీలో..

## బాలిక హత్యపై చంద్రబాబు సీరియస్

### ఉన్మాదులను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక

**అమరావతి,ఏప్రిల్11** కడప జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో నిందితులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. ఖాజీపేట ప్రాంతంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్య ఘటనపై సీఎం సీరియస్ అయ్యారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.కడప జిల్లా ఖాజీపేటలో రామకీర్తనను(17) వెంకటేశ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కొంత కాలంగా ప్రేమించాలంటూ బాలికను వేధింపులకు గురిచేశాడు వెంకటేష్. అందుకు బాలిక నిరాకరించడంతో కోపంతో ఊగిపోయిన ప్రేమోన్మాది.. శుక్రవారం బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఒంటిరిగా ఉంది. దీంతో తనను ప్రేమించాలని బలవంతం చేశాడు వెంకటేశ్. అందుకు కీర్తన నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక గొంతు కోశాడు ఉన్మాది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చి చూడగా కూతురు రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## పోలీసుల నుంచి పారిపోయే యత్నం

### కాల్పుల్లో నిందితుడు వెంకటేశ్ కాలుకు గాయాలు

**కడప,ఏప్రిల్11** : ఖాజీపేట విద్యార్థిని రామకీర్తనను చంపిన ప్రేమోన్మాది వెంకటేష్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడిని మైదుకూరు నుంచి తీసుకెళుతుండగా.. బాసాపురం చెక్‌పోస్ట్ దగ్గర పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అడ్డుకోవటంతో వారిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే సీఐ వంశీధర్ నిందితుడిపై కాల్పులు జరిపారు. దీంతో నిందితుడి కాలికి గాయం అయింది. పోలీసులు అతడిని కడప రిమ్స్‌కు తరలించారు. కడప జిల్లాలోని ఖాజీపేట మండలం ఆంజనేయకోట్టాలు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్ అనే యువకుడు, అదే మండలం ఖాజీపేట అగ్రహారానికి చెందిన రామకీర్తనను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడు. ఇందుకు బాలిక నిరాకరించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అక్కడికి వెళ్లాడు. పెళ్లి చేసుకోమంటూ ఒత్తిడి తెచ్చాడు. బాలిక ఇందుకు ఒప్పుకోకపోవటంతో ఆగ్రహానికి గురయ్యాడు. వెంటతెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడికి దిగాడు. బాలిక గొంతు కోసి అక్కడినుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి శ్రీనివాసులు హుటాహుటిన ఇంటికి వెళ్లాడు. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆమెను చేతులతో మోసుకొని వాహనంలోకి చేర్చాడు. కూతురిని కడప రిమ్స్‌కు తరలించే ప్రయత్నం చేశాడు. కొనఊపిరితో ఉన్న బాలిక వెంకటేశ్‌తో పాటు ప్రవీణ్ అనే వ్యక్తి పేరును తండ్రికి చెప్పింది. మార్గం మధ్యలో చెన్నూరు వద్ద ప్రాణాలు కోల్పోయింది.

## మహాత్మా జ్యోతిబా పులే 200వ జయంతి

మొదటి పేజి తరువాయి..

బీజేపీ నేత జేపీనడ్డా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను పలకరిస్తూ ముందుకు వెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్న తరుణంలో ప్రధాని, ప్రతిపక్ష నేత పరస్పరం సంభాషించుకోవడం అందర్నీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇటీవల కాలంలో పలు పబ్లిక్ స్పీచ్‌లు, రాజకీయ ర్యాలీల్లో మోదీ, రాహుల్ మధ్య విమర్శలు చోటుచేసుకున్నాయి. మోదీ రాజీపడే నేత అని, మన విదేశాంగ విధానం మోదీ పర్సనల్ పాలసీగా మారిందని, ఆయన ఏమి చేయాలో ఏమి చేయకూడదో ట్రంప్ నిర్దేశిస్తురటారని రాహుల్ విమర్శలు గుప్పించారు. రాహుల్ విమర్శలను మోదీ తిప్పికొట్టుతూ, ఆయనొక స్వయం ప్రకటిత రాజకుమారుడని చురకలు వేశారు. తాజాగా వీరిద్దరు ముచ్చటించుకోవడం ఆసక్తికర పరిణామంగా చ ఎప్పుకోవాలి.

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి పేజి తరువాయి..

మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## 200కు పైగా సీట్లలో గెలిస్తున్నాం

మొదటి పేజి తరువాయి..

కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగింది

మొదటి పేజి తరువాయి..

వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు, 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేది ఈ వర్క్‌షాప్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను రక్షించామని వివరించారు. వివిధ దేశాల్లో చిక్కుకున్న180 మందిని కూడా రక్షించామని తెలిపారు. పోలీస్ శాఖలో కూడా నూతన టెక్నాలజీతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే.. ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉంటుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

మొదటి పేజి తరువాయి..

జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# జ్యోతిరావు పూలే జయంతి

మొదటి పేజి తరువాయి..

ద్విశాబ్ది జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. సామాజిక విప్లవ పితామహుడు పూలే. కుల వివక్షకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల, మహిళల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు మనకు ఎప్పటికీ ఆదర్శం. ఆయన చూపిన మార్గంలో నడవడం మన సామాజిక బాధ్యత. 'విద్య లేనివాడు వివేకం కోల్పోతాడు, వివేకం లేనివాడు నైతికత కోల్పోతాడు, నైతికత లేనివాడు అభివృద్ధిని కోల్పోతాడు' అని ఆయన చేసిన బోధనలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి' అని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. దళితుల అభ్యున్నతి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన జీవితాంతం కృషిచేశారు. విద్య ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేశారు. ఆయన జయంతిని ప్రజాప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది. సామాజిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం' అంటూ మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మంత్రి సవిత అన్నారు. మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. జ్యోతిరావు పూలే లక్ష్య సాధనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## ఈ సారి వర్షాలు తక్కువే

మొదటి పేజి తరువాయి..

ఏర్పడ్డాయని పేర్కొంది. అయితే, 2026లో పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించింది. 2018 సంవత్సరం తరహాలో ఈసారి వర్షపాతం ఉండొచ్చని అంచనా వేసింది. జూన్- సెప్టెంబర్ కాలంలో అన్ని నెలలూ 'సగటు కంటే తక్కువ' వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. కానీ, 2014-15 సంవత్సరాల మాదిరిగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. మహబూబ్‌నగర్, నారాయణపేట్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల్ వంటి ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండడంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మేరకు నీటి వనరులను అన్నదాతలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. వరి వంటి ఎక్కువ నీరు అవసరమైన పంటలకు బదులుగా పప్పు, జొన్న వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని చెబుతున్నారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షాలు పడే సూచనలు ఉన్నందున ప్రభుత్వం, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

## వేసవి సెలవుల్లో విద్యార్థులకు డ్రై రేషన్

మొదటి పేజి తరువాయి..

విద్యార్థులు సెలవుల్లో పౌష్టికాహార లోపానికి గురికాకుండా చూడటమే ఈ పథకం లక్ష్యం. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, ప్రకాశం జిల్లాల్లోని 51 కరువు మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎంపిక చేసిన కరువు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతులు పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఈ డ్రై రేషన్ అందజేస్తారు. ప్రాథమిక స్థాయి (1-5 తరగతులు) ఉన్నత పాఠశాల స్థాయి (6-9 తరగతులు) విద్యార్థులకు ఈ డ్రై రేషన్ అందిస్తున్నారు. ప్రతి విద్యార్థికి సెలవుల కాలానికి సరిపడా కింది వస్తువులను పంపిణీ చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల పిల్లలకు 4 కిలోలు, ఉన్నత పాఠశాల పిల్లలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తారు. ఒక్కో విద్యార్థికి 35 కోడిగుడ్లు, పోషకాల కోసం 21 చిక్కీలు ఇస్తారు. సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా క్షిఖ ధ్రువీకరణ ద్వారానే సరుకులు అందజేస్తారు. పంపిణీ పూర్తయిన వెంటనే ఆ వివరాలను ప్రభుత్వం కేటాయించిన మొబైల్ యాప్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ ప్రక్రియను నేరుగా పర్యవేక్షిస్తారు. సెలవుల్లోనూ విద్యార్థుల ఆరోగ్యం, పోషణ బాధ్యతను స్వీకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం వేలమంది విద్యార్థుల కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తోంది.

## క్లీన్ పాలిటిక్స్.. పాజిటివ్ ఓటింగ్

మొదటి పేజి తరువాయి..

ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుందని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఇ3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నేతలకు తెలియజేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఇ3 ప్రొగ్రాం తీసుకొస్తామని చెప్పారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్' కార్యక్రమం చేపడతామన్నారు. 'నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

మొదటి పేజి తరువాయి..

జేరెడ్ కుష్నర్‌లు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు. శుక్రవారం పెట్టిన ఓ పోస్టులో.. 'ఇరాన్ యుద్ధం
చేసే దానికంటే.. ఫేక్ న్యూస్ మీడియాను, పబ్లిక్ రిలేషన్స్‌ను హ్యాండిల్ చేయటంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

మొదటి పేజి తరువాయి..

మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో కూడా ఉన్నారని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తొలగించిన 90 లక్షల మంది ఓటర్లలో 60 లక్షల మంది హిందువులు, 30 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. బెంగాలీ మాట్లాడినంత మాత్రమే మనం భారతీయులం కాదా? నిరంతరం పౌరసత్వం నిరూపించుకోవాలా?' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామంటూ బీజేపీ ఎన్నికల హామీపై మాట్లాడుతూ, ఈ చర్యను వెనుకబడిన వర్గాలపై నేరుగా దాడి చేసేందుకు, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కొల్లగొట్టేందుకు జరుపుతున్న దాడిగా ఆమె పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో యూసీసీని అమలు చేసేది లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి.. ఢిల్లీలో బీజేపీకి ఉద్వాసన పలుకుతామని, ఆ వెంటనే యూసీసీని రద్దు చేస్తామని మమత స్పష్టం చేశారు.

## జ్యోతిరావు పూలే స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలి

### వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 11,( చట్టం బ్యూరో)** ; జ్యోతిరావు పూలే స్ఫూర్తితో నేటితరం విద్యార్థులు యువత ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారతదేశంలో సామాజిక రుగ్మతలను రూపుమాపి ఎంతో మందికి మేలు చేసిన మహోన్నతమైన గొప్ప నాయకుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. భారతదేశ సమాజం నిరంతరం జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ఎటువంటి వైరుధ్యం లేకుండా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కొత్త పెల్లిలో ప్రత్యేక రోడ్డు పనుల ప్రారంభం



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 11 ,(చట్టం బ్యూరో)** ; కొత్తపల్లి బస్టాండ్ నుండి రైల్వే బ్రిడ్జి వరకు ప్రత్యేక రోడ్డు మరమ్మత్తుల పనులను 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత-చంద్రశేఖర్ 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ స్వర్గం వజ్రదేవి-నర్సయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ పర్శరాములు మరియు 17వ,18వ డివిజన్ ప్రజలు గుండేటి విశ్వనాథం,బుస రామకృష్ణ, పెంటి రాజమౌళి, గుండేటి సుధాకర్, చిప్ప శేఖర్, చిటుకూరి శ్రీనివాస్, మేకల పోచమల్లు, గుండేటి శ్రీనివాస్, పెంటి సుధాకర్, ఎలిగేటి రాజేందర్,వంగ చంద్రమౌళి, వంగ లక్ష్మి నారాయణ,ధ్యావనపెల్లి లక్ష్మినారాయణ, కామారపు సాయి, దాసరి రాకేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

### సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ




**మహబూబాబాద్ జిల్లా మరిపెడ, ఏప్రిల్ 11, చట్టం న్యూస్, :** సమాజంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దే ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా కాపాడాలని సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలక్రిష్ణ అన్నారు.వాస్తవాలు పరిగణలోకి తీసుకొని ఉపాధ్యాయులపై ప్రకటనలు చేయాలే తప్ప వాస్తవాలు పరిగణలోకి తీసుకోకుండా చేస్తే సమాజ నిర్మాణానికి పనిచేసే ఉపాధ్యాయ వర్గం పై మచ్చ అవుతుంది అని అన్నారు.ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లింట తీవ్ర విషాదం

### రోడ్డు ప్రమాదంలో పెళ్లి కొడుకు తండ్రి మృతి

కామారెడ్డి,ఏప్రిల్11: పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. పెళ్లి కుమారుడి తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. రెండ్రోజుల్లో కొడుకు పెళ్లి ఉందనగా.. సరుకుల కోసం వెళ్లిన తండ్రి దుర్గయ్య రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అయ్యపల్లి గ్రామం వద్ద అతడి బైక్‌ను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు

- **పెగడపల్లి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిరటి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో**
- **మళ్లీ జయంతి ఉత్సవాల వరకు విగ్రహ ప్రతిష్టకు హామీ కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**పెగడపల్లి, ఏప్రిల్ 11 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పగడపల్లి మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 199 జయంతి వేడుకలను మండల జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీలకతీతంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి పనులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాబోయే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకల వరకు నూతన విగ్రహం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సహకారంతో విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు బీసీల 42% రిజర్వేషన్లు వచ్చేంతవరకు బీసీలందరూ ఐక్యతతో కలిసి పోరాటం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు నీరటి రాజ్ కుమార్ గౌరవ అధ్యక్షులు బండారి బీరయ్య సలహాదారులు నెల్లి మల్లేశం చిన్నం తిరుపతి ముల్క రాజేశం కోశాధికారి గంగుల కొమురెల్లి బీసీ నాయకులు ఉప్పు రవి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు మోకినపల్లి గోపాల్ ఇస్లావత్ రమేష్ నాయక్ మాజీ సర్పంచ్ ఇస్లావత్ రవి నాయక్ నాయకులు మేక సుధాకర్ రెడ్డి కడారి తిరుపతి చాట్ల విజయభాస్కర్ తోట మల్లేశం పూసాల తిరుపతి నీరటి రాజేందర్ పుల్కం జలపతి చెట్ల కిషన్ పెద్ద సత్యం మహేష్ చిరంజీవి నాయక్ నాగరాజు వంశీధర్ రావు ఎల్లయ్య కొత్తూరు బాబు బొమ్మన పురుషోత్తం మోదంపల్లి అంజి బొమ్మనశంకర్ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి





- **నూతనంగా ఏర్పాటు చేయబోతున్న పార్టీ బహిరంగ వాల్ పోస్టర్ విడుదల**
- **రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, జాగృతి మహిళ రాష్ట్ర అధ్యక్షులు మారిపెల్లి మాధవి**

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 11,(చట్టం న్యూస్) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 25 న నూతన పార్టీని ప్రకటించబోతున్నారని ఆ కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లో జరిగే బహిరంగ సభ ద్వారా ప్రకటిస్తున్నారని కావున జిల్లా నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, జాగృతి మహిళ రాష్ట్ర అధ్యక్షులు మారిపెల్లి మాధవి పిలుపునిచ్చారు. శనివారం జాగృతి మానుకోట జిల్లా సీనియర్ నాయకులు గంధసిరి వేణు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిదులుగా జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, జాగృతి మహిళ రాష్ట్ర అధ్యక్షులు మారిపెల్లి మాధవి హాజరై బహిరంగ సభ పోస్టర్స్ ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 25 న కల్వకుంట్ల కవిత పెట్టబోతున్న నూతన రాజకీయ పార్టీ సంబందించిన బహిరంగ సభ ను మేడ్చల్ జిల్లా మునిరాబాద్ లో నిర్వహించనున్నారని ఈ సభను మానుకోట జిల్లా లోని ప్రజలు గిరిజన బిడ్డలు అత్యధికంగా తరలి రావాలి అని అన్నారు. ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడే పార్టీ గా తెలంగాణ ఆస్తిత్వాన్ని కాపాడే ఇంటి పార్టీ గా యువత కు, విద్యార్థులకు, మహిళల కు పెద్ద పిటా వేసేవిధంగా విప్లవత్మాకమైన మార్పుల తో జాగృతి పార్టీ రాబోతుందని రాజకీయ చారిత్రక ఘట్టాన్ని విజయవంతం చేయడానికి జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు ఆసిఫ్ అలీ, ధర్మారపు పవన్ కుమార్, కళ్యాణ్ నాయక్, శంషుద్దీన్, మా పల్లె వేణు, దుర్గాప్రసాద్, జన్ను సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిశీల యువజన సంఘం 9వ జిల్లా మహాసభలను జయప్రదశీ చేయండి

**పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, జిల్లా కోశాధికారి పగడాల శివ**

**భూదాన్ పోచంపల్లి ;ఏప్రిల్ 11 (చట్టం ప్రతినిధి) :** గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని, ప్రతి సంవత్సరం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమయిందని ప్రగతిశీల యువజన సంఘం కుమార్, శివ అన్నారు భూదాన్ పోచంపల్లి పట్టణంలో ఈనెల 21 న కె,పి రమాదేవి ఫంక్షన్ హాలలో జరిగే ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) 9వ జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు నాలుగు వేలు కల్పిస్తామని, అలాగే నిరుద్యోగులకు రుణాలు ఇస్తామని దరఖాస్తులు తీసుకొని నేటి వరకు ఇవ్వలేక పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి జాబ్ కేలండర్ ప్రకటిస్తామని ఇప్పటివరకు ప్రకటించక లేకపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహసభలను , ఈ జిల్లాలో ఉన్న యువతీ, యువకులు,నిరుద్యోగులు,ప్రజాస్వామికవాదులు జయప్రదం చేయాలని కోరారు. ఈ



కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లకొండ, నాగరాజు, జిల్లాసహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, మండల నాయకులు గోరుగంటి ముత్యాలు, పోతగల నరసింహ, ఆకుల కృష్ణ, పెద్దల మల్లేశం, కొత్త బాబు తదితరులు పాల్గొన్నారు .

-----------

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొన్న మాజీ సర్పంచ్ లతా శ్రీ శంకర్



**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 11,( చట్టం బ్యూరో ) :** తమ పెళ్లిరోజు పురస్కరించుకొని వారి ఇంటి ఆవరణలో మొక్క నాటిన బోయినిపల్లి మండల మాజీ సర్పంచ్ గుంటి లతశ్రీ జేసీ శంకర్ మరియు బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దంపతులు.. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో పాల్గొని తమ పెళ్లిరోజు పురస్కరించుకొని వారి ఇంటి ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కొబ్బరి మొక్క నాటిన మాజీ సర్పంచ్ గుంటి లతశ్రీ శంకర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా పెళ్లి రోజు సందర్భంగా మొక్క నాటడం సంతోషంగా ఉందని తెలిపారు మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా కోట్లాది మొక్కలు నటించి మొన్ననే వరల్డ్ గ్రీన్ అవర్డ్ ప్రకటించారు కాబట్టే భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మండల అధ్యక్షుడు మెదుధుల మల్లేశం, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, అక్కెనపల్లి కర్ణాకర్, కన్నం సాగర్, బోయిని రాజు, గురజాల కోటి, తొంటి మధు, సిద్దు, మనోహర్, మధు, మరియు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు సంబంధించి మరోసారి గడువు పొడగింపు



**వనపర్తి 9 ఏప్రిల్ 2026 ( చట్టం న్యూస్) :** జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు సంబంధించి మరోసారి గడువు పొడగించారు. 2025 2026 సంవత్సరానికి గాను గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల నివసిస్తున్న అభ్యర్థులకు స్వయం ఉపాధి పథకం కింద దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 16 వరకు గడువు పొడగించడమైనదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాచుద్దీన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము ఎస్సీ అభ్యర్థులకు పాడే పశువుల పెంపకంపై ఉపాధి అవకాశాలు పెంచడం వల్ల ప్రతి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

అధికారిక ఆన్లైన్ ద్వారా చేసిన దరఖాస్తులు మాత్రమే స్వీకరించబడతాయని ఆయన తెలిపారు.

ఈ స్వయం ఉపాధి పథకాన్ని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అర్హత ఆధారంగా అభ్యర్థులను వెరిఫికేషన్ చేసి కమిటీ ద్వారా సెలెక్ట్ జాబితా పూర్తి చేస్తామని అర్హులైన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమావేశంలో తెలిపారు.

-------

# స్తంభంపల్లి గ్రామంలో నిర్వహించిన పోచమ్మ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**బోయిన్ పల్లి మండలం /ఏప్రిల్ 11,( చట్టం న్యూస్) :** చొప్పదండి నియోజకవర్గం బోయినీపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై పోచమ్మ తల్లిని చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ వి. నరేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# 199వ మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలలో చైర్మన్ రేగుంట నరసయ్య



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ రేగుంట నర్సయ్య ఆధ్వర్యంలో పూలతో నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట, అతిథిగా మోకెనపల్లి సతీష్, మాదిగ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, మరియు ముఖ్య అతిథులుగా మెరుగు నరేష్, బండమీద కవిత, గోపి, సర్పంచ్, మూగల సతీష్, ఓరగంటి రాజయ్య, ఎనగందుల నరేష్, ధర్మాజీ గణేష్. వేల్పుల రవి, చిత్త రాజయ్య, పాల్గొనడం జరిగింది.

# వెంకటేశ్వరుని నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 11 చట్టం ప్రతినిధి :** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డులోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తులను కనువిందు చేసింది. ఉదయం యాగశాలలో చతుస్థానార్చనలు, నిత్య పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఆలయ శాశ్వత ధర్మకర్తలు పొట్లూరి వెంకట కృష్ణరావు--మీనాక్షి దంపతుల ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు కోయల్ కందాడై వరదరాజ స్వామి, వంశీ కృష్ణమాచార్య, పీతాంబర కృష్ణదాస్ సమక్షంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని బి.ఎస్. వ్రజపతి స్వామి, డి.ఎస్. వ్రజేంద్ర స్వామి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులకు సుమారు 7 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు.

# కుమ్మరి పల్లె ఆదర్శ పాఠశాలలో సీట్ల భర్తీకై నిర్వహించే ప్రవేశ పరీక్ష

**కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్**

**వెల్గటూర్, ఏప్రిల్ 11 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ఆదర్శ పాఠశాల కుమ్మరిపల్లిలో 19వ తేదీన 6వ తరగతి మరియు 7, 8, 9, 10, వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకై నిర్వహించే ప్రవేశ పరీక్ష సంబంధించి హాల్ టికెట్స్ వెబ్సైట్లు అందుబాటులో కలవు 19వ, తేదీన ఉదయం 10 గంటలకు 6వ, తరగతి ప్రవేశ పరీక్ష కలదు. 7, 8,9,10వ, తరగతికి సంబంధించి మధ్యాహ్నం 2:00 గంటలకు పరీక్ష నిర్వహించబడును. అప్లై చేసిన విద్యార్థులు హాల్



# వర్ణవివక్షకు వ్యతిరకంగా పోరాడిన మహోనుభావుడు

### పూలే జయంతి సందర్భంగా కెసిఆర్ ఘన నివాళి

**హైదరాబాద్,ఏప్రిల్11 :** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం జరిగిందని అన్నారు. ఆసరా ఫించన్లు, బీసీ బంధు వంటి బహుజన సంక్షేమ పథకాల అమలు ద్వారా, వెనకబడి ఉన్న సబ్బండ కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. బీసీ కులాల విద్యకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని కేసీఆర్ తెలిపారు. బీసీ బిడ్డల భవిష్యత్తు తరాల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాష్ట్ర రాజధాని నగరం హైద్రాబాద్ లో ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం, అత్యంత విలువైన స్థలాలను, నిర్మాణ నిధులను,బీసీ కుల సంఘాలకు కేటాయించినామని తెలిపారు. బీసీ కులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా మాత్రమే మహాత్మాపూలేకు మనం ఘన నివాళి అర్పించిన వారమవుతామని కేసీఆర్ స్పష్ఠం చేశారు.


## మా పోరాటం వల్లనే రైల్వేజోన్ వచ్చింది

### శిక్ష కేసును హైకోర్టులో సవాల్ చేస్తా: గుడివాడ

**విశాఖపట్టణం,ఏప్రిల్11 :** అప్పట్లో రైల్వేజోన్ కోసం పోరాటం చేయడం వల్లే ఇప్పుడు విశాఖకు జోన్ వచ్చిందని వైకాపా నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ కేటాయించాలని కోరుతూ 2016 ఏప్రిల్‌లో అమర్‌నాథ్ ఆందోళనలు నిర్వహించారు. స్థానిక జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఈ ఘటనపై అప్పట్లో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో గుడివాడకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ.. విశాఖపట్నంలోని రెండో అదనపు ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి వరలక్ష్మి తీర్పు ఇచ్చారు. విచారణ పూర్తవడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి మాజీ మంత్రికి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. దిగువ న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై హైకోర్టులో అప్పీలుకు వెళ్తానని అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఇది ప్రజల కోసం చేసిన పోరాటమని అన్నారు.

## న్యాయవాదికి బెదరింపులు

### గాయని మంగ్లీ తదితరులపై కేసు



హైదరాబాద్,ఏప్రిల్11 : తెలుగు రాష్ట్రాల్లో ఫోక్ సాంగ్స్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ గాయని మంగ్లీ ఇప్పుడు వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడుల పేరుతో డబ్బులు సేకరించి మోసం చేయడం, అలాగే న్యాయవాదిని బెదిరించడం వంటి ఆరోపణలపై ఆమెపై కేసు నమోదవడం సంచలనంగా మారింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు ప్రకారం, మంగ్లీ, ఆమె సోదరుడు శివ మరియు మరికొంత మంది కలిసి సుమారు 100 మంది నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. అయితే, కాలం గడుస్తున్నా ఎటువంటి లాభాలు ఇవ్వకపోవడం మాత్రమే కాకుండా, పెట్టుబడిగా ఇచ్చిన అసలు డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో వారు ఆందోళన చెందుతూ న్యాయం కోసం న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో న్యాయవాది జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది. బాధితుల తరపున డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా, మంగ్లీ మరియు ఆమె బృందం నుంచి బెదిరింపులు వచ్చాయని సుబ్బారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా, ఈ కేసులో దర్శకుడు వేణు ఊడుగుల పేరు కూడా వెలుగులోకి రావడం గమనార్హం. మంగ్లీ, శివ, వేణు ఊడుగుల కలిసి ఫోన్ ద్వారా తీవ్రంగా బెదిరించారని, తనను యాక్సిడెంట్ చేయించి చంపేస్తామని హెచ్చరించారని న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ పోలీసుల వద్ద రక్షణ కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, మంగ్లీ, శివ, వేణు ఊడుగుల మరియు ఇతరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.వరుస హిట్ పాటలతో కెరీర్‌లో దూసుకుపోతున్న మంగ్లీపై ఈ తరహా ఆరోపణలు రావడం సినీ, సంగీత రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో నిజానిజాలు ఏవో దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా, తన పాటలతో మంచి ఫేమ్ అందిపుచ్చుకున్న మంగ్లీ వివాదాలతో ఇమేజ్ బ్యాడ్ చేసుకుంటుంది.

## అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

### భారీ బందోబస్తు మధ్య ఆక్రమణ కూల్చివేత



సంగారెడ్డి,ఏప్రిల్11 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చి వేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది. ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లున్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. 1998 నుంచి 'స్టేటస్ కో' కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలంచారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు రూ.15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.

# దక్షిణాదిపై కక్షకట్టిన కేంద్రం

### ఉత్తరాదిలో ఎంపి సీట్లు పెంచుకునే కుట్ర

### పూలే జయంతి ఉత్సవాల్లో భట్టి

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలన్నారు. సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క.. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు . బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా.. ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో, సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామని అన్నారు భట్టి విక్రమార్క. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం మేము అడుగులు వేస్తున్నామన్నారు భట్టి. ఆనాడు పూలే లాంటి మహనీయులే వివక్షకు గురైనా భవిష్యత్ తరాల కోసం వారు వేసిన పునాదులే మార్గదర్శకాలన్నారు భట్టి.

------

# ఎప్పుడు ఎన్నికలొచ్చనా..అవి కెసిఆర్ ఎన్నికలే

- కెసిఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు
- అనేక హామీలతో డబ్బా కొటట్ఇన రేవంత్
- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కెటిఆర్



హైదరాబాద్,ఏప్రిల్11 : ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మీదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగోట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి
కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# విజయ్ 'జననాయగన్' లీక్‌తో బిజెపికేం సంబంధం

### కేంద్రమంత్రి మురుగన్‌పై ఆరోపణలు సరికాదు

### నేనూ విజయ్ అభిమానినే అన్న అన్నామలై

కోయంబత్తూరు,ఏప్రిల్11 : సెన్సార్ బోర్డు సమస్యలతో విడుదలలో జాప్యమైన విజయ్ 'జననాయగన్' సినిమా ఇప్పుడు థియేటర్‌కు రాకుండానే ఇంటర్‌నెట్‌లో లీక్ కావడం హాట్‌టాపిక్ అయింది. దీనిపై దక్షిణాది పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించారు. దీనికి తాజాగా రాజకీయ రంగు కూడా పులుముకుంటోంది. ఈ చిత్రం ఆన్‌లైన్‌లో లీక్ కావడం వెనుక కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాత్ర ఉందంటూ టీవీకే ఆరోపణలు చేసింది. అయితే ఈ రోపణలను తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై వెంటనే ఖండించారు. ఇవి రాజకీయ దిగజారుడు ఆరోపణలుగా
కొట్టివేశారు. 'జననాయగన్' సినిమా లీక్ కావడం చట్టవిరుద్ధమైన చర్య అని, ఈ చిత్రం పైరేటెడ్ వెర్షన్‌కు ప్రజలు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూరులో పార్టీ అభ్యర్థి తరఫు ప్రచారం సాగిస్తున్న అన్నామలై శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఈ వివాదంలోకి బీజేపీని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. సినిమాల విడుదల, లీక్ వ్యవహారాల్లో పార్టీకి ఎలా ప్రమేయం ఉంటుందని నిలదీశారు. వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీని ఇందులోకి లాగడం సరికాదని చెప్పారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఉన్న మురుగన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)పై తన పరపతిని ఉపయోగించి సినిమాను లీక్ చేయించారని ఈనెల 10న టీవీకే నేత ఆధవ్ అర్జున ఆరోపించారు. థియేటర్‌లో విడుదలకు ముందే ఆన్‌లైన్‌లో సినిమా లీక్ అయ్యేందుకు ఆయన ఉదయనిధి స్టాలిన్ సహకారం తీసుకున్నారని అన్నారు. దీనిపై అన్నామలై స్పందిస్తూ, టీవీకే మద్దతుదారులు, నేతలు కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. సీబీఎఫ్‌సీని బీజేపీ కంట్రోల్ చేయదని, సినిమా ప్రొడక్షన్ విషయంలో కానీ, విడుదల విషయంలో కానీ బీజేపీ ప్రమేయం లేదని స్పష్టంచేశారు. విజయ్ అభిమానులలో తాను కూడా ఉన్నానని, అధికారికంగా సినిమా విడుదల కాగానే థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తానని అన్నామలై చెప్పారు. ఒక సినిమా వెనుక ఎంతోమంది కష్టం, ప్రొడక్షన్ కంపెనీల పెట్టుబడులు వంటివి ఎన్నో ఉంటాయని, ప్రజలు ఆన్‌లైన్‌లో లీక్ అయిన వీడియోలను చూడకుండా వాటికి దూరంగా ఉండాలని కోరారు.

## మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

### కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు

**వాషింగ్టన్,ఏప్రిల్11 :** ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

## పూలే జయంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి



న్యూఢిల్లీ,ఏప్రిల్11 :మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఢిల్లీలోని నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమహనీయుడి ఔన్నత్యాన్ని గుర్తు చేసుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీ మల్లు రవి కూడా నివాళులు అర్పించారు.

## హైవేపై నిలిపిన వాహనాలే టార్గెట్

### డీజిల్ దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

### వేయి లీటర్ల డీజిల్ సహా వాహనాలు స్వాధీనం

నల్గొండ,ఏప్రిల్11 : రోడ్డుపక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితులలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. ఆ ముఠా నుంచి 1000 లీటర్ల డీజిల్ సహా.. రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ శనివారం మీడియా సమావేశంలో ఈ ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, దొంగతనానికి వాడే ఇతర పనిముట్లు ఉన్నాయి. ఈ ముఠా సభ్యులపై గతంలోనే 20కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా అర్ధరాత్రి సమయాల్లో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించి డీజిల్‌ను తమ వాహనాల్లోకి తరలించేవారు. హైవేలపై వాహనాలు నిలిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

### ఎక్సైజ్ కమిషనర్ తీరుతో మనస్తాపం

#### ఉద్యోగానికి రాజీనామా చేసిన డిప్యూటి

నిజామాబాద్,ఏప్రిల్11 : జిల్లా ఎక్సైజ్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది, ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలు, వేధింపులు తట్టుకోలేకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. బదిలీల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారం మాట్లాడడం బాధ కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చెయ్యలేనంటూ ప్రభుత్వానికి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి లేఖ సైతం రాశారు.

# కొండ కాలనీలో కార్డెన్ సెర్చ్





**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 11 చట్టం ప్రతినిధి :** ఆపరేషన్ వజ్రప్రహార్ ఆగిరిపల్లి కొండ కాలనీలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ను నూజివీడు డీఎస్పీ శ్రీ కె వి వి ఎన్ వి ప్రసాద్ గారు నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ కె రామ కృష్ణ గారు ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు పోలీస్ మరియు ఈగల్ టీమ్ ఆర్ ఎస్ ఐ ఉదయ భాస్కర్ గారు ఉమ్మడిగా నిర్వహించినారు

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఆగిరిపల్లి ను తీర్చిది ద్దడమే లక్ష్యంగా ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగముగా ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, డిఎస్పీ గారు వారి యొక్క సిబ్బంది తో కలిసి ఈ రోజు అనగా 11.04.2026 వ తేది న ఆగిరిపల్లి కొండ కాలనీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిం చారు.

నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీ సత్య శ్రీనివాస్ గారు, నూజివీడు టౌన్ ఎస్ఐ నాగేశ్వరరావు గారు,చాట్రాయి ఎస్ఐ, డి రామకృష్ణ గారు ముసునూరు ఎస్సై చిరంజీవి గారు, పోలీస్ శాఖ మరియు ఈగల్ టీమ్ విభాగానికి చెందిన సుమారు 50 మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

ఆయా ప్రాంతా లను చుట్టు ముట్టి ప్రతి ఇంటిని మరియు అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ ఆపరేషన్ సందర్భంగా సరైన పత్రాలు లేని 47 మోటార్ సైకిళ్ల ను పోలీసులు స్వాధీనం చేసు కున్నారు.



గంజాయి నిల్వలు, అక్రమ రవాణా మరి యు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడే అనుమానితులపై నిఘా పెంచారు.తనిఖీల అనంతరం నూజివీడు డీఎస్పీ శ్రీ కె వి వి ఎన్ వి ప్రసాద్ గారు స్థానిక ప్రజలతో మాట్లాడి పలు కీలక సూచనలు చేసినారు.

మత్తు పదార్థాల అనర్థాలు గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల యువత భవి ష్యత్తు నాశనమవుతుందని, అటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

టోల్ ఫ్రీ నెంబర్ 1972 గంజాయి అమ్మకాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 1972 నెంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచు తామని, భయం లేకుండా ముందుకు రావాలని ప్రజలకు భరోసా ఇచ్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని, అక్రమ వ్యాపారాలు చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేశారు.

ఆపరేషన్ వజ్రప్రహార్ నూజివీడు సబ్ డివిజన్ వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతుందని డీఎస్పీ గారు తెలియ చేసినారు

# దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది

**రాయికల్ ఏప్రిల్ (11) చట్టం :** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే దాగి ఉందని ఆ యువత సరైన దిశలో నడవాలంటే క్రీడలు అత్యంత అవసరమని రాయికల్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ పుర్రె శ్రీధర్ అన్నారు. మహాత్మ జ్యోతిరావ్ బాపూలే అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ఆవరణలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాయికల్ శాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను జ్యోతిరావు బాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండడానికి, విద్యార్థులు మొబైల్ ఫోన్ వ్యసనానికి అలవాటు



కాకుండా క్రీడలు ఉపయోగపడతాయన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాదు, మానసిక ధైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యాలకు పునాది వేస్తాయి అని పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వంటి మహనీయుల ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. మైదానంలో చెమటోడ్చే యువతే జీవితంలో విజయం సాధిస్తారని అన్నారు. క్రీడల వైపు మళ్లిన యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండటమే కాదు, సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. క్రీడల్లో గెలుపు–ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పోటీ పడటమే అసలైన విజయమని సూచించారు. క్రీడల నిర్వహణకు సహాయ సహకారాలు అందజేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాపురపు నర్సయ్య, సందెల రాజేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు బందెల శ్రీనివాస్, పుర్రె రమేష్, ప్రతాప్, రాజేందర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబాపూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ స్థాపనలో స్ఫూర్తిప్ర దాత

**నీలం సంపత్ కుమార్**
**ప్రధానోపాధ్యాయులు.**

**వెల్గటూర్, ఏప్రిల్ 11 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్లటూర్ మండలం గ్రామం వాషిగామా లో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది.అణగారిన వర్గాల సంక్షేమం,స్త్రీ విద్య, సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, 199వ, జయంతి వేడుకలు ప్రాథమిక పాఠశాల పాషిగామాలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సంపత్ మాట్లాడుతూ భారతదేశంలో సమ సమాజ స్థాపన, అణగారిన వర్గాల సంక్షేమం, స్త్రీల విద్య, విద్య ద్వారానే ఒక వ్యక్తి తనని తాను మార్చుకుంటూ, కుటుంబాన్ని, సమాజాన్ని మార్చే ఆయుధమని జ్యోతిబాపూలే,గారి కృషి వలన నేడు ఎంతోమంది చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, అంబేద్కర్, లాంటి మహనీయులు కూడా వారిని ఆదర్శంగా తీసుకొని, విద్య ద్వారానే ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందాడని పేర్కొన్నారు. విద్యార్థులు మహనీయుల చరిత్రను చదువుతూ, వారి మార్గాన్ని ఆచరించినప్పుడు దేనినైనా సాధించగలరని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, రజిత, ప్రణీత, పాఠశాల సహాయకులు ప్రవళిక , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**కొడిమ్యాల, ఏప్రిల్ 11(చట్టం) :** కడమేడ కళాసాహితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విస్డం పాఠశాలలో శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వార్డు సభ్యులు, కడమేడ కళాసాహితి సభ్యులు, పాత్రికేయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాపర్తి నర్సింగరావు, దుబ్బాక రాధ, కడమేడ కళాసాహితి అధ్యక్షులు మల్లారపు రాజయ్య, కార్యదర్శి ఇనుగంటి సత్యానందం, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు ఏనుగు ఆదిరెడ్డి, లెక్చరర్ భాస్కర్, ఐక్య సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు

**రాయికల్ ఏప్రిల్ (11) చట్టం :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం అల్లిపూర్, ప్రధానోపాధ్యాయులు కిరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అయోధ్య, ఉప్పుమాడుగు, అల్లిపూర్ గడికోట పాఠశాలలను అల్లిపూర్ గ్రామ మహిళా సంఘ సభ్యులను కలిసి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మరియు మహిళా సంఘం ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన అందుతుందని వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధన సాగుతోందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలందరినీ బడికి పంపే బాధ్యతను తల్లులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, మహిళా సంఘం నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



**ఏలూరు జిల్లా ఏప్రిల్ 11 చట్టం ప్రతినిధి :** మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో గీతా భవన్ నందు ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు సంగా రంగారావు గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగినవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల ఉపాధ్యక్షుడు రెడ్డి రామారావు, ప్రధాన కార్యదర్శి జలసూత్రం శేషగిరి రావు , కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రెడ్డి స్వామి, ఆత్మ నిర్భర్ మండల కన్వీనర్ పరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, రెడ్డి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో వ్యక్తి మృతి

**భూదాన్ పోచంపల్లి ; ఏప్రిల్ 11 (చట్టం ప్రతినిధి) :** మండల పరిధిలోని జూలూరు గ్రామంలోని ఆలీ నగర్ గ్రామం నివాసి చినాలి. బాలరాజు o/ శీ లింగయ్య 44 శనివారం ప్రతిరోజూ లాగే ఉదయం 7.30గంటలకు బర్రేలకు పచ్చ గడ్డి తేవడానికి వెళ్లి 11.00 అయిన ఇంటికి రాకపోయే సరికి , అతని భార్య, వారికి తెలిసిన సీత ఆయిలయ్య కి తన భర్త ఇంటికి రాలేదు పొలం దగ్గర చూడమని చెప్పగా,ఆయన ముక్తాపూర్ గ్రామ చివరిలోని నర్సింహారెడ్డి పొలం దగ్గరికి వెళ్ళి చూసే సరికి,గడ్డి కోసే కొడవలి కరెంట్ వైరు కి తగిలి , కరెంటు షాకు వచ్చి చనిపోయి ఉండడంతో , కల్పన ఆమె కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి ,తన భర్త చనిపోవడంతో పోలీసు వారికి పిర్యాదు ఇవ్వడం జరిగింది . ఎస్సై భాస్కర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సెమీకండక్టర్ నానోస్ట్రక్చర్స్‌పై వెబినార్



**అగిరిపల్లి, ఏప్రిల్ 11:** డా. ఆర్‌విఆర్ ఎన్ఆర్ఐ ఐటి డీమ్డ్ టు బి యూనివర్సిటీ, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో “సెమీకండక్టర్ నానోస్ట్రక్చర్స్ ఫర్ ఆప్టోఎలక్ట్రానిక్స్ అప్లికేషన్స్” అంశంపై వెబినార్ నిర్వహించారు.

ముఖ్య అతిథిగా Australian Academy of Science అధ్యక్షుడు, Australian National University ఎమెరిటస్ ప్రొఫెసర్ Chennupati Jagadish పాల్గొని సెమీకండక్టర్ నానోస్ట్రక్చర్స్ ప్రాధాన్యత, వాటి వినియోగంపై వివరించ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.ఎస్. సాంబశివరావు గారు ఇలాంటి కార్యక్రమాలు అకడమిక్ ఉత్తమతకు దోహదపడతాయని తెలిపారు. ప్రో వైస్ చాన్సలర్లు జి. సాంబశివరావు, సి. నాగ భాస్కర్ గారు కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. డా. ఆర్. సునీత స్వాగతం పలికగా, డా. కె. రామాంజనేయులు (హెచ్ఓడి--ఈసీఈ) విభాగం పరిశోధనా కట్టుబాటును వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని, ప్రశ్నోత్తరాల ద్వారా అంశంపై అవగాహన పెంపొందించుకున్నారు.


## పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

**విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం**
**అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ**
**కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన**

**హైదరాబాద్,ఏప్రిల్11 :** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝనాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్యం÷–ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## భగవద్గీత
## భగవద్గీతావతరణ
## ఉపోద్ఘాతము.
## ....ప్రవేశిక



(అందరికి శుభోదయం.. భగవద్గీత ను వచన రూపంలో అందించాలనే సంకల్పంతో శ్రీకృష్ణుణి సంకల్పంతో రాయడం జరిగింది.)

కురుక్షేత్రంలో ధర్మ క్షేత్రంలో
దుష్ట శిక్షణ కొరకు శిష్ట రక్షణ కొరకు

ధర్మ రక్షణ కొరకు భక్త రక్షణ కొరకు
పాపాత్ముల పతనం కొరకు కురుక్షేత్ర యుద్ధం జరిగే

కదన రంగమున కౌరవ పాండవ సేన
అతిరథ మహారథులందరు ఎదురెదురు నిలిచె

కౌరవ పక్షాన భీష్మ, ద్రోణు, కృపాచార్యులు
దుశ్శాసన, శకుని, కర్ణ, వికర్ణ యోధానుయోధులు

పాండవ పక్షాన ధృష్టద్యుమ్నుడు, శిఖండి
అభిమన్యు,సాత్వికార్జన శ్రీకృష్ణ భగవానులు

యుద్ధరంగంలో వీరాధి వీరులు
అరివీర భయంకరులు అస్త్ర శస్త్రాలు ధరించి

బంధుమిత్రులను తాతలు, ముత్తాతలను
అన్నదమ్ములు మేనమామలను
అర్జునుడు కాంచెను కదన రంగమున

మనసు వికలం చెంది రణరంగం మధ్యన నిలిచి
గాండీవం జారి అస్త్ర శస్త్రాలు సన్యసించి

యుద్ధ రంగంలో అర్జునుడు అడిగె
సాక్షాత్తు భగవంతుడు ప్రభోదించె
వేదవ్యాసుడు విరచించె ప్రజలందరూ తరించె...

తొలి దినమున వెలిసే ఏడువందల శ్లోకాలతో
పద్దెనిమిది అధ్యాయాలతో
భగవద్గీత అవతరణ జరిగే....
(ఇంకావుంది)

రచన:-
భగవాను శ్రీ కృష్ణ ఆనతితో వేనాప
వేంకట నారాయణ పరిమి
జి.ప.ఉ.పా.గుడిబండ
కోదాడ 98484 32533.

చట్టం సాహితీ లోకం 95814 19999

## జై పాతాళ భైరవి...!
## నరుడా...ఏమిరా
## నీ కోరిక...?



తల్లీ...కష్టాల కత్తులపై
నా పాదాలు రక్తమోడుతున్నాయి
కన్నీళ్లు నైవేద్యమై జారుతున్నాయి
ఉద్యోగం ఊడిపోగా
ఇంటిలో పొయ్యి చల్లారిపోయింది...
అప్పుల పాము కసిగా కాటేస్తోంది...
ఊపిరి అణగదొక్కిన
బండరాయిలా ఉంది నా చీకటి జీవితం...
మరణమొక్కటే శరణ్యంగా కనిపిస్తోంది...

తల్లీ...అర్జంటుగా
ఒక "లక్ష రూపాయలు" కావాలి...
అంతేనా డింభకా...?
లక్ష కాదు..."కోటిరూపాయలిస్తా"...
తీసుకో...! ఒక్క క్షణంలోనే
ఖాతాలోకి వరదలా
చేరిన "కోటి రూపాయలు"
కళ్లలో మెరుపులై మెరుస్తుండగా
ఇది కలనా... నిజమా...
అన్న సందేహం కరిగిపోయింది...

ఔను ఇది నిజంరా నీ తల్లి వరం రా...
నీ నమ్మకానికి దక్కిన ప్రతిఫలం రా...
అని నవ్వి తల్లి మాయమైపోయింది...

జై పాతాళ భైరవి...!
నరుడా మళ్ళీ ఏమిరా నీ కోరిక..?
చిన్న...గ్యాస్ బండ...కావాలి తల్లీ...

సారిరా డింభకా...!
కోటి వరాలైనా ఇస్తానురా...కానీ
ఆ గ్యాస్ బండ ఒక్కటి అడక్కురా...

ఎందుకు తల్లీ...?
పశ్చిమాసియాలో భీకరమైన
యుద్ధాగ్ని రగులుతోందిరా...
అగ్ర రాజ్యాలు ఉగ్రరూపం దాల్చేరా
అణుబాంబుల ఆట ఆరంభమాయేరా...
గ్యాస్ బండలు ఇప్పుడు
వంట కోసం కాదురా...డింభకా...అవి
ప్రళయానికి విలయానికి ఆయుధాలురా..

అందుకే ప్రపంచాన్ని
బాంబుల భయంతో బంధించే
హిట్లర్ నెతన్యాహును
యుద్ధ తుగ్లక్ ట్రంప్ ను
అదుగరా....డింభకా...అంటూ
మిస్సైల్స్ పొగలో మాయమైపోయింది...

అయ్యో నా వరం హర్మూజ్
జలసంధిలో ఆయిల్ నౌకలా
చిక్కుకు పోయింది
జై పాతాళ భైరవి...! జై పాతాళ భైరవి...!
అని ఎంతగా అరచినా
వరాలిచ్చే నా తల్లి కనకదుర్గ
కనిపించదాయే కరుణించదాయె...!

ఓ యుద్ధ మదాంధుడా...!
నీ యుద్ధ విమానాల బాంబులమోతతో
భూమి గుండెల్లో భూకంపం పుట్టె కదరా
వంటకు కావాల్సిన గ్యాస్ బండ
ప్రళయ విలయ జ్వాలగా మారె గదరా...

ఒక్కసారిచూడు పిల్లల కన్నీటి సముద్రాన్ని
అగ్గిలో బుగ్గైన అమాయకుల జీవితాలను
ప్రపంచాన నిండిన నిట్టూర్పుల శ్వాసలను.
ఇకనైనా ఆపరా...
నీ రాక్షస క్రీడను...
చేయకురా రక్తస్నానం...!
చేయకురా
శవాలపై శివతాండవం...!
వ్రాయకురా...
మానవత్వానికి మరణశాసనం...!

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

చట్టం సాహితీ లోకం 95814 19999

## మాతృత్వ
## దినోత్సవం..



కనిపెంచిన అమ్మదనం..తియ్యని మధురానుభూతి..
-ఏప్రిల్ 11 న ప్రసూతి సంతానం..వారసత్వం సుగమం..
-గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, 9నెలలు భద్రత.. నిరీక్షణ
-తల్లుల ఆరోగ్యం పై అధ్యయనం,గొప్పతనము జ్ఞప్తికి తెచ్చు కొనుట
-ఏప్రిల్ పదకొండున, ఉత్సాహ, ఉత్కంఠ భరితం ఈ శుభదినం, కొన్ని దేశాల్లో మే రెండవ ఆదివారం..
-తల్లి ప్రేమ, త్యాగం దయకు, ఆలనకు ప్రతీక,
-రుగ్మతల,పురిటినొప్పుల తొలగింపు ప్రభుత్వాల పాత్ర..
-ప్రత్యేక కృతజ్ఞతలు, పండుగ ఉత్సాహం, ఆనందడోలిక తల్లికి బహుమతులు..
-శారీరక, భౌతిక శ్రమకు సామాజికబాధ్యతతో, అవిభక్త, కుటుంబ వ్యవస్థలో కర్తకు ఇచ్చే గౌరవం,నిరంతరం..
-బంధాలు,సుగంధాలు రక్త సంబంధాలు కావాలని ఆకాంక్షించే రోజు..కన్ను తెరచిన క్షణాలు..
-అన్నా జర్విస్ తల్లి వర్ధంతికి 1914 నుండి ఆచరణలో వితరణ ప్రజలకు అందజేత రోజు
-తల్లికి ఇష్టమైన వంటలు, సమయం,తో ప్రత్యేక కృతజ్ఞతలు, పండుగ..
-నేడు సురక్షిత, -మాతృత్వ గర్భిణులపై వైద్య శ్రద్ధ, ఆహారం,ప్రసూతి సెలవులు, ఆర్థిక పథకాలు ఇచ్చుట..
-పిల్లలను కంటికి రెప్పలా, కాబోయే తల్లులకు, పుట్టబోయే బిడ్డలకు మందులు పంపిణీ..
-ప్రసవం పునర్జన్మ,సంతోషకరం ప్రసవము ముందు తరువాత తీసుకోవాల్సిన చర్యలు, గర్భిణీకి ఉపేక్షితం..
-బిడ్డకు బిడ్డకు మధ్యలో ఉండాల్సిన కాలపరిమితి, ఋతుక్రమము, వాంతులు, రక్త సరఫరా,రక్తహీనత, కిడ్నీ లరక్షణ, గ్యాస్ రాకుండా చూడటం,వయసు,బాధ్యతలు చెప్పడం..
-పాలు,పెరుగు,మసాల లేని కూరలు, గ్రుడ్లు,మంచినీరు తీసుకోవడం అవసరం..
-ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్ గల ఆహార పదార్థాలు తీసుకోవడం అవసరం...
-ఐరన్, కాల్షియం టాబ్లెట్స్ వినియోగం ఎక్కువగా ఉండటం మంచిది..
-మల, మూత్ర విసర్జన గుండె సంబంధిత వ్యాధులున్న వాటిని పరిశీలించి, పరిష్కరించాలి..
-రక్త స్రావం జరగ రాదు,రక్త హీనత రక్త కణాలు తగ్గరాదు..
-హీమోగ్లోబిన్ 12 -14 శాతం మధ్య ఉండాలి,
-బిడ్డ కదలిక, ముఖం, కాళ్ళు వాపులు లాంటి ప్రమాద సూచికలను డాక్టర్లుకు చెప్పాలి..
-28,36 వారాలకు డాక్టర్ల దగ్గర పరీక్షలు చేయడం అవసరం..
సిజేరియన్ కంటే ఆస్పత్రి లో ప్రసవం ఆరోగ్యకరం..చీము లేకుండా చూడాలి, రక్తం గడ్డకట్ట కుండా దృష్టి సారించడం మంచిది..

-చందు ఆంజనేయులు,
విశ్రాంత ప్రాచార్యులు..

చట్టం సాహితీ లోకం 95814 19999

## భక్తకవి మన ధూర్జటి




1.
భావగర్భిత ఆర్భటీకవి
భక్తితత్వం మదిని గలిగియు
కవితయందున మధుర మహిమను
కూర్చి వ్రాసెన ఘనుడు ధూర్జటి

2.
రాయలాస్థాన మందుండిన
ప్రభువు చేతన పొగడ బడిన
అష్టదిగ్గజ కవుల యందున
పలుకు పలుకున తేనె లొలకగ
భక్తి కవితను సృష్టి చేసెను


3.
భక్తి ప్రబంధము శివుని పైన
భక్తి శతకమ్ము భవుని పైన
సరళ భాషన మృదుపదాలను
చాతురతతో వ్రాసె తెలుగున

4.
తండ్రి నారా యణుడు తల్లి సింగ
మ్మలకు శ్రీకాళహస్తి బుట్టె
స్తుతి మతియైన ఆంధ్ర కవియే
ధూర్జటి మహా శివుని భక్తుడు

5.
శివుని ప్రశ్నించి, స్తుతియించి
భక్తి కవితా గాన సుధతో
అలతి పదముల భావగరిమను
చాటి మనలకు ముదము గొల్పెను

6.
సాధు చరితుడు శాంత చిత్తుడు
జనుల మనముల యందు నుండిన
అజాతశత్రువుగా నిలచెను
కావ్యలోకమునందు ధూర్జటి

రచన:
మహేంద్రాడ సింహాచలాచార్య
స్కూల్ అసిస్టెంట్ తెలుగు
టెక్కలి శ్రీకాకుళం జిల్లా
చరవాణి: 9703483648



చట్టం సాహితీ లోకం 95814 19999

## ఈ పూసిన సౌందర్యం
## నీకోసమే,,,,,!!

అంశం : చిత్రకవిత

ఇలాంటి రమణీయ సుందర దృశ్యాలలో మనస్సులోని అంధకారం నుంచి సుదూరంగా దృష్టి మరలు మరులుగొని,,,,,,,,,,
మనస్సు విరిగిపోయి జీవితంపై విరక్తి చెంది మూగ కళ్ళల్లో ఏదో తెలియని బాధ నుండి కాస్త సెదదీరెందుకు ఆహ్లాద వాతావరణం,,,,,,,,,
ఎవరో విసిరిన వలలో చిక్కి ఎన్నెన్నో దుఃఖాల కోర్చి ఎలాగోలా బయటపడి అన్నీ కోల్పోయి విధి నిర్దయగా కాళ్ళ కింది భూమి బద్దలయ్యే వేళ ఈ లేత ఎరుపు ఊదా రంగుల మేళవించిన ప్రకృతి ఒడిలో సేదదీరుతూ కాసేపు కళ్ళు మూసుకుంటే ఆ ఆహ్లాదంలో అన్నీ మరచిన క్షణాలు మరువలేనివి మాసిపోనివి,,,,,,,,,,,,,
ఈ వరండాకు సుదూరంగా పర్వతాలపై ఊదా రంగు మబ్బులు తేలియాడుతూ జాజి రంగు ఆకాశం నలువైపులా అలుముకుంటూ మనస్సు పడ్డ వేదనల నుండి ఉపశమనం పొందుతూ ప్రశాంతత మనస్సు నిండా ఆవరించి తేలికయి కళ్ళు రెండు అలవోకగా మూసుకుని ఈ జీవితం ఇంతే తిరుగదోడకు గాయాలు మానిపోనీ మాసిపోనీ,,,,,,,,,
పొగిలి పొగిలి వచ్చే దుఃఖం తాలూకు కారణాలేమైనా కానీ మరువలేని సుమధుర ఘట్టాలు గుర్తుచేసుకుని నీలోని గాయాలకు లేపనంలా సౌందర్య పిపాసకునివై ఆనందోబ్రహ్మాలా కళ్ళు మూసుకుని ధ్యానంలో తేలిపో సాయం సంధ్యలోనే జీవం పోసుకో చీకట్లనే ప్రేమించు అదిగో చంద్రుడు వెన్నెలలు నక్షత్రాలు అమావాస్యలు నెలవంకలు సౌందర్యం లేనిదెక్కడనోయ్,,,,,,,,,!!

అపరాజిత్
సూర్యాపేట



చట్టం సాహితీ లోకం 95814 19999

## పొదుపు కావాలి...!




వచ్చిన ధనంలో
సంపాదనలో
పొదుపు కావాలి
జాగ్రత వహించాలి.
దుబారా ఖర్చుతో
దుర్వ్యసనాలతో
అనవసర పనులతో
అత్యుత్సాహం తో
డబ్బు దుర్వినియోగం చేస్తే
అవసరానికి ఆదుకొదు
భవిష్యత్తుకు బాటలు వెయ్యదు.
చేయు మంచి భీమా
నీకు రక్ష
కుటుంబానికి రక్షణ
భవిష్యత్తుకు సంరక్షణ
వచ్చిన డబ్బులో ఆదా చెయ్యి
సరయిన సమయంలో భీమా చెయ్యి
కష్టాలు తలుస్తూ
కాలాన్ని దాటవేస్తూ
ఎప్పుడు ఇప్పుడు కాదు అనుకుంటూ
పుణ్య కాలం గడిపేస్తే
ఆపదలో అండ ఉండదు
అవసరానికి ధీమా దొరకదు.
సమయానికి భీమా
జీవితానికి ధీమా.

డా. యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి,
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.



చట్టం సాహితీ లోకం 95814 19999

## కోరిన వరమిచ్చె
## కొండంత దేవుడా

కొండంత దేవుడా కోనేటి రాయడా
కొండలన్ని వరములను గుప్పుతున్నవాడా

నామొక్కు తీర్చుకొన నన్ను రప్పించుకోర
క్షేమయోగ శ్రీలీయ చెంతకు పిల్పించుకోర
కామషడ్వర్గాంత కాన్కల నిప్పించుకోర
మామొరాలించి బాధత్రుంచి మమ్మేలుకోర

మూడునామాల వాడి ముచ్చటైనకొండ
ఏడేడు లోకాల కేడుగడ యీ కొండ
అడగడుగు దండాల ఆపదమొక్కుల కొండ

పుడమియె పసిడియైన పుణ్యాల కొండ

పెనుబాము పడగలపై నవనిధుల కొండ
అనిమిషుల కాలవాల మరుదైన కొండ
మునులెల్ల నెలకొన్న ముత్తెముల కొండ
ఘనులంత తరలివచ్చె ఘనమైన కొండ

భూలోకవైకుంఠం ముముక్షువు ముక్తికొండ
నీళాద్రి వేంకటాద్రి నీరజాక్షు నిండుకొండ
సాలోక్య సాయుజ్యం సర్వజనుల కండదండ
వేలాది వేల్పుకొండ వినతులందు వెండికొండ




రచన::శంకర్ జీ డబ్బీకార్
ఊరు::ఇబ్రాహీంపట్నం
రంగారెడ్డి
చరవాణి::9160297956
----------

# అభయ కోదండ రామాలయంలో శ్రీ వారి పుష్పయాగం

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 11 చట్టం ప్రతినిధి :** ఆగిరిపల్లి గ్రామంలోని విజయవాడ రోడ్డులో ఉన్న శ్రీ అభయ కోదండ రామస్వామి వారి ఆలయంలో శనివారం ఉదయం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. సీతారామ కళ్యాణం జరిగి 16 రోజులు పూర్తైన సందర్భంగా వైఖానసాగమోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామిజి ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలతో ప్రారంభమైన పూజలు లక్ష తులసి దళార్చనతో కొనసాగి, విశేష పూలతో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. వేదమూర్తుల వేదపారాయణం, భక్తుల శ్రీరామ నామసంకీర్తనలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. శుభగిరి శ్రీనివాస సత్సంగ వ్యవస్థాపకులు రత్నాకరం వెంకట రామకృష్ణ దీక్షితులు, ఆలయ అర్చకులు చక్రవర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, యండూరు ప్రణీత్ అలేఖ్య, యండూరు మిథున్ మౌనిక దంపతులు సహా అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం మంత్రపుష్ప నీరాజనంతో కార్యక్రమం ముగిసింది.

చట్టం సాహితీ లోకం 95814 19999

## వలస వెళ్తున్న
## సాంప్రదాయాలు



కాడెడ్ల బండి పచ్చని పొలాలు
పల్లె సోయగాలు వలస వెళ్లి
పట్నం నగరం కు నడక సాగిస్తున్నారు నేటి జనం
జీవన గమనం గమ్యం కోసం ధనం
వ్యాపారం కోసం చదువు సామ్రాజ్యం కోసం
సాంప్రదాయాలు వలస వెళ్తున్న వైనం
కట్టు బొట్టు లో మార్పు
కాయ కష్టం లో మార్పు
తిండి నివాసం లో మార్పు
సూచనలు సలహాలలో మార్పు పెద్ద చిన్న
కుటుంబం వర్గం లో మార్పు
ప్రేమ ఆప్యాయతల్లో మార్పు
అనురాగం ఆత్మీయతల్లో మార్పు
కొందరు కరువు కోసం వలస
కొందరు కలిమి కోసం వలస
మొత్తం గా వలస వెళ్తున్న వి భారతీయ
సాంప్రదాయాలు ...

డి చాంద్ బాషా రచయిత




## మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు ఆదర్శాలు యువతరానికి మార్గదర్శనం




మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు ఆదర్శాలు యువతరానికి మార్గదర్శనం అని డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ అన్నారు.శనివారం నాడు లక్డీకా పూల్ లోని బి.సి.అడ్డాలో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సత్యశోధక సమాజ్ స్థాపించారని గులాం గిరీ లాంటి రచనల ద్వారా అక్షర అగ్నిని కురిపించిన విప్లవ వీరుడు పోరాటాల సూర్యుడు అని కొనియాడారు.జ్యోతిరావు పూలే పై డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ రాసిన కవిత అందరి ప్రశంసలు పొందింది.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డి.జి.పి.పూర్ణచందర్ రావు,బి.సి.టైమ్స్ సంపాదకులు సూర్య రావు, మహబూబ్ నగర్ రిటైర్డ్ జిల్లా విద్యాశాఖాధికారి విజయ్ కుమార్, డాక్టర్.వేముల నారాయణ, శ్రీశైలం తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# జననాయగన్' లీక్ వ్యవస్థలో లోపం

### నటుడు కమలహాసన్ ఆవేదన


ప్రస్తుతం ఇండస్ట్రీలో 'జననాయగన్' లీక్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై అగ్రహీరోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడుదల కూడా కాకముందే సినిమా లీక్ కావడంతో అటు దర్శకనిర్మాతలు కూడా షాక్ అయ్యారు. వెంటనే పైరసీని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. లీక్ అయిన సన్నివేశాలను షేర్ చేయడం కూడా చట్టపరమైన నేరమేనని ఎవరూ షేర్ చేయొద్దంటూ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రీలోని ప్రముఖులు దీనిపై వరుస పోస్టులు పెడుతున్నారు. సినిమా దురదృష్టవశాత్తూ లీక్ కావడం తననెంతో ఆందోళనకు గురి చేసిందని చిరంజీవి
ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో స్టార్ హీరో కమల్‌హాసన్ పోస్ట్ వైరల్‌గా మారింది. సెన్సార్ జాప్యం వల్లే సినిమా లీక్ అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'జననాయగన్ సినిమా లీక్ అవడం అనుకోకుండా జరిగిన విషయం కాదు. ఇది వ్యవస్థ వైఫల్య ఫలితం. దీని పనులు సకాలంలో జరిగిఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు. సెన్సార్‌బోర్డులో జరిగిన విపరీతమైన జాప్యం పైరసీకి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. పైరసీ రాజకీయాలకు అతీతమైనది. అది కళపై, కళాకారుడి పైన చేసే దాడి. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కృషిని ప్రమాదంలో పడేస్తుంది. అలాగే మనం ప్రేమించే సినిమాను నిలబెడుతున్న వాళ్లపై, నిజాయతీగా పన్ను చెల్లిస్తున్న నిర్మాతలు, థియేటర్ యజమానులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వ్యవస్థ విఫలమైనప్పుడు సినిమాను ఎవరు కాపాడతారు? విడుదల విషయంలో చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు విచారణ వేగవంతం



చేయాలి. గతంలో మీరు నాకు అండగా నిలిచినట్లే, నిజమైన సినిమా ప్రేమికులు ఇప్పుడు కూడా ఏకమవ్వండి. ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూద్దాం. దానికి సహకరించండి' అని కమల్ హాసన్ అన్నారు. 'సినిమా లీక్ అయిందని తెలిసి షాక్ అయ్యాను. చాలా బాధగా ఉంది. దీనికి కారణమైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి' అని రజనీకాంత్ ఆవేదన వ్యక్తంచేశారు.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన




తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.

---


# తమ్ముడు టైటిల్ కోసం నాగార్జున పెద్దమనసు




సినీ పరిశ్రమలో సినిమా టైటిల్స్ మారడం, ఒకరి దగ్గరున్న టైటిల్ మరొకరు తీసుకోవడం చాలా సాధారణ విషయం. ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ అయిన టైటిల్‌ను అవసరమైతే రిక్వెస్ట్ ద్వారా లేదా పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలాంటి అరుదైన, ఆసక్తికర సంఘటనల్లో ఒకటి పవన్ కళ్యాణ్ మరియు నాగార్జున మధ్య జరిగిన 'తమ్ముడు' టైటిల్ వ్యవహారం. 'తొలిప్రేమ' భారీ విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే దర్శకుడు అరుణ్ ప్రసాద్ తో కలిసి ఆయన చేసిన సినిమా 'తమ్ముడు'. ఈ చిత్రం విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, పవన్‌ను యూత్ ఐకాన్‌గా మరింత బలపరిచింది. ముఖ్యంగా పాటలు, స్టైల్, యాక్షన్, కామెడీ అన్నీ కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'తమ్ముడు' అనే టైటిల్ మొదట నాగార్జున వద్దే ఉంది. ఆయన, హరికృష్ణ కలిసి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఒక సినిమా చేయాలని ప్లాన్ చేశారు. ఆ కథకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను నిర్ణయించి ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ కూడా చేయించారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమా కోసం నిర్మాత శివ రామకృష్ణ ఆ టైటిల్‌ను నాగార్జునను అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించి 'తమ్ముడు' టైటిల్‌ను ఇచ్చేశారు. తరువాత నాగార్జున తన సినిమాకు 'సీతారామరాజు' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. ఇదే సమయంలో పవన్ నటించిన 'తమ్ముడు' కూడా భారీ హిట్ అయింది. ఇది టాలీవుడ్‌లోని సానుకూల వాతావరణాన్ని, కళాకారుల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

# ప్యారడైజ్ నుంచి కాయదు లోహార్ లుక్ విడుదల


నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయదు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.




# ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న సారా అర్జున్


బాలీవుడ్ నటి, 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ శనివారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి ఆలయానికి చేరుకున్న ఆమెకి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక సారా మహాకాళేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన భస్మ హారతి సేవలో పాల్గొంది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్ర ముగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనకు మాటలు రావడం లేదని, స్వామివారి పిలుపు రావడం వల్లే తాను ఇక్కడికి రాగలిగానని తెలిపారు. ప్రపంచంలో దీనిని మించిన గొప్ప అనుభూతి మరొకటి లేదని, ఈ పర్యటన తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మహాకాళేశ్వర ఆలయంలో జరిగే
క్రతువుల్లో భస్మ హారతికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రతిరోజూ తెల్లవారుజామున 3:30 నుండి 5:30 గంటల మధ్య బ్రహ్మ ముహూర్తంలో ఈ పూజను నిర్వహిస్తారు. ఆలయ తలుపులు తీసిన వెంటనే స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, చక్కెర, తేనెతో కూడిన పంచామృత అభిషేకం చేస్తారు. అనంతరం గంధం, ఇతర సుగంధ ద్రవ్యాలతో అలంకరించి, మంత్రోచ్చారణలు, శంఖ నాదాలు, డప్పు వాయిద్యాల మధ్య భస్మ హారతిని కన్నుల పండువగా జరుపుతారు. ఇక హిందూ ధర్మంలోని 12 జ్యోతిర్లింగాలలో ఉజ్జయిని మహాకాళేశ్వరుడు ఒకరిగా పూజలందుకుంటున్నారు. ఈ భస్మ హారతిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అందుకే దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి తరలివస్తుంటారు.

-----



# స్వయంభు టీజర్‌కు భారీ స్పందన

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.



# చట్టం స్పోర్ట్స్




## 212 పరుగుల టార్గెట్ విధించిన చెన్నై

**చెన్నై,ఏప్రిల్11 :** ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగి నిరాశపర్చిన ఓపెనర్ సంజు శాంసన్ (115?; 56 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఈ మ్యాచ్‌లో ఏకంగా సెంచరీ బాదేశాడు. ఈ ఐపీఎల్‌లో నమోదైన తొలి శతకం ఇదే కావడం విశేషం. రుతురాజ్ గైక్వాడ్ (15) త్వరగానే పెవిలియన్ చేరగా.. వన్‌డౌన్‌లో వచ్చిన ఆయుష్ మాత్రే (59 రిటైర్డ్ ఔట్; 36 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు. శివమ్ దూబె (20?) పరుగులు చేశాడు.

## అభిషేక్ శర్మ రికార్డు

### కేవలం 18 బంతుల్లో హాఫ్ సెంచరీ




చండీఘర్,ఏప్రిల్11 : ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడతున్నాయి. ఎస్ఆర్‌హెచ్ పవర్ హిట్టర్, అభిమానుల 'పులి' అభిషేక్ శర్మ వీర విధ్వంసం చేశాడు. పంజాబ్ బౌలర్లపై సిక్సర్లు, బౌండరీలతో విరుచుపడి కేవలం 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదేశాడు. తన బ్యాటింగ్ పార్ట్‌నర్ ట్రావిస్ హెడ్(38)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 120 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీల్లో అభిషేక్ శర్మ అరుదైన రికార్డును నమోదు చేశాడు.

పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఐదో ఓవర్లో విజయ్ కుమార్ వైశాఖ్ వేసిన నాలుగో బంతికి భారీ సిక్సర్ బాది అభిషేక్ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. దీంతో ఐపీఎల్ టోర్నీలో 20 కన్నా తక్కువ బంతుల్లో అత్యధిక సార్లు హాఫ్ సెంచరీ చేసిన తొలి క్రికెటర్‌గా అరుదైన గుర్తింపు సాధించాడు. గత ఐపీఎల్ సీజన్లలో అభిషేక్ ఇప్పటికే నాలుగుసార్లు వేగవంతమైన హాఫ్ సెంచరీలు బాదాడు. ఈ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ జాబితాలో అభిషేక్ శర్మ తర్వాత నికోలస్ పూరన్ నిలిచాడు. ఐపీఎల్‌లో నాలుగుసార్లు 20 కంటే తక్కువ బంతుల్లో పూరన్ హాఫ్ సెంచరీలు సాధించాడు. జేక్ ఫ్రేజర్, ట్రావిస్ హెడ్, వైభవ్ సూర్యవంశీ మూడుసార్లు 20 బంతుల్లోపే హాఫ్ సెంచరీ చేశారు. ఇక ఐపీఎల్ చరిత్రలోనే వేగవంతమైన అర్ధ శతకం రాజస్థాన్ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ పేరు మీద ఉంది. 2023లో అతడు కోల్‌కతాపై కేవలం 13 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసిన విషయం తెలిసిందే.

## మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన సంజూ

### శతకంతో చెలరేగిన శాంసన్



చెన్నై,ఏప్రిల్11 :పొట్టి ప్రపంచకప్ హీరో సంజూ శాంసన్ మళ్లీ ఫామ్ అందుకున్నాడు. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో వరసగా మూడు మ్యాచుల్లో విఫలమైన సంజూ.. చెపాక్‌లో చెలరేగిపోయాడు. చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులను సంబురాల్లో ముంచెత్తుతూ ఈ ఎడిషన్‌లో తొలి శతకం కొట్టేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న సంజూ ముకేశ్ ఓవర్లో సింగిల్‌తో 26 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. పసుపు జెర్సీతో అతడికిదే మొదటి యాభై కావడంతో.. మనసు తేలికైనట్టుగా కనిపించాడు శాంసన్. కలల జట్టైన చెన్నై సూపర్ కింగ్స్ తరపున దుమ్మురేపాలనుకున్న సంజూ శాంసన్ ఎట్టకేలకు బ్యాట్ ఝులిపించాడు. ఐపీఎల్‌లో తొలిసారి సీఎస్కేకు ఆడుతూ.. మూడు మ్యాచుల్లో నిరాశపరిచిన సంజూ శనివారం తన తడాఖా చూపించాడు. వరల్డ్‌కప్ ఫామ్‌ను అందుకుంటూ బౌండరీలతో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ల భరతం పట్టాడు.




## సన్‌రైజర్స్ ఖాతాలో మరో ఓటమి



చండీఘర్,ఏప్రిల్11 :ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు రెండో ఓటమి ఎదురైంది. బ్యాటర్లు మెరిసినా.. బౌలర్ల వైఫల్యం హైదరాబాద్ జట్టును ముంచింది. ముల్లన్‌పూర్‌లో ఆరెంజ్ ఆర్మీ నిర్దేశిరచిన 220 పరుగలు ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. పోటా పోటీగా బౌండరీలు బాదిన ప్రియాన్ష్ ఆర్య(57), ప్రభ్‌సిమ్రన్ సింగ్(51) లక్ష్యాన్ని కరిగించగా.. శివాంగ్ కుమార్(3-33) వరుస వికెట్లతో ఆశలు రేపాడు. కానీ, నేనున్నాగా అంటూ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో విరుచుకుపడిన శ్రేయాస్ అయ్యర్(69 నాటౌట్) మరో ఓవర్ ఉండగానే పంజాబ్‌ను గెలిపించాడు. భారీ స్కోర్ కొట్టినా సరే పసలేని బౌలింగ్ కారణంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ వరసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. ముల్లన్‌పూర్‌లో అభిషేక్ శర్మ(74 28 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లు) విధ్వంసంతో పంజాబ్ కింగ్స్‌కు 220 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిరచిన ఆరెంజ్ ఆర్మీ.. పవర్ ప్లేలోనే దండిగా రన్స్ ఇచ్చుకుంది.

## వైభవ్ ఆటకు అంతా ఫిదా కావాల్సిందే




**న్యూఢిల్లీ,ఏప్రిల్11 :** గతేడాది ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ ఆట చూశాక.. ఏదో గాలివాటం ప్రదర్శన అంటూ కొట్టిపడేసినవారూ లేకపోలేదు. కానీ దేశవాళీతోపాటు అండర్-19 ఎమర్జింగ్ ఆసియా కప్‌లో వైభవ్ ప్రదర్శన అద్భుతమనే చెప్పాలి. సరేలే.. అక్కడున్నవారంతా వైభవ్ మాదిరిగా పిల్లలే కదా అని కామెంట్లూ వచ్చాయి. ఎప్పుడైతే ఐపీఎల్ 2026 సీజన్‌లో అడుగుపెట్టాడో.. ఇక్కడ చూపించమనండి అతడి సత్తా ఏంటో అని సోషల్ మీడియాలో సవాళ్లు విసిరారు. ఇప్పటికి రాజస్థాన్ నాలుగు మ్యాచులు ఆడింది. అన్నింటా విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో పరుగుల జోరు మొదలుపెట్టిన వైభవ్.. మ్యాట్ హెన్రీ వంటి అగ్రశ్రేణి బౌలర్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. ఇక గుజరాత్‌తో అయితే సిరాజ్, రబాడ, ప్రసిద్ధ్‌కృష్ణనూ వదల్లేదు. వీరంతా ఒకెత్తు అయితే.. ముంబయితో మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా వేసిన తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు వైభవ్. అరే.. బాబూ వాళ్లేమీ గల్లీ బౌలర్లు కాదు.. ప్రపంచంలోనే టాప్ బౌలర్లు.. అలాంటివారికి కాస్త రెస్పెక్ట్ ఇవ్వు అనే ఫ్యాన్స్‌కు తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు ఈ 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇక జోష్ హేజిల్ వుడ్, భువనేశ్వర్ కుమార్ సంగతి సరేసరి. వారికీ చుక్కలు చూపించాడు. ఈ సీజన్‌లో 266 స్ట్రైక్‌రేట్‌తో నాలుగు మ్యాచుల్లో 200 పరుగులు రాబట్టాడు.

## ఆసియన్ బ్యాడ్మింటన్‌లో ఆయుశ్ శెట్టి సంచలనం

**న్యూఢిల్లీ,ఏప్రిల్11 :** భారత బ్యాడ్మింటన్‌లో చారిత్రాత్మక విజయం నమోదైంది. చైనాలోని నింగ్బో వేదికగా జరుగుతోన్న ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ ఆయుశ్ శెట్టి సంచలనం సృష్టించాడు. సెమీస్‌లో ప్రపంచ నంబర్ వన్, డిఫెండింగ్ ఛాంపియన్ కున్లావుత్ వితిద్సర్న్(థాయ్‌లాండ్)ను ఓడించి ఆయుశ్ ÷నైల్‌కు దూసుకెళ్లాడు. తొలి సెట్‌ను 10-21తో కోల్పోయినప్పటికీ పట్టువదలకుండా పోరాడి గెలిచాడు. హోరాహోరీగా సాగిన పోరులో 10-21, 21-19, 21-17 తేడాతో ఆయుశ్ విజేతగా నిలిచాడు. కేవలం మూడు సెట్లు మాత్రమే ఉండే సెమీస్‌లో తొలి మ్యాచ్‌లోనే ఓడాడు ఆయుష్. అయినప్పటికీ తిరిగి పుంజుకుని అద్భుతం చేశాడు. వరుసగా రెండు సెట్లలో గెలిచి ÷నైల్‌కు దూసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆయుశ్ షెట్టి ఓ అరుదైన ఘనతను సాధించాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ ÷నైల్‌కు చేరిన రెండో భారత షట్లర్‌గా నిలిచాడు. 1965లో దినేశ్ ఖన్నా తొలిసారి భారత్ తరఫున ÷నైల్‌కు చేరారు. ఒకవేళ ÷నైల్‌లోనూ గెలిచి స్వర్ణం సాధిస్తే ఆయుష్.. తొలి భారత షట్లర్‌గా రికార్డు సృష్టిస్తాడు.

-------------




Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999